

సాక్షి చిత్తూరు

శనివారం । 5 । అక్టోబర్ । 2024



స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

నిత్యం ప్రమాదాలు జరిగే మొగిలి ఘాట్‌లో అధికారులు స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయించారు. - 6లో



టమాట అ'ధర'హో..

ఇతర రాష్ట్రాల్లో టమాట దిగుబడి తగ్గడంతో పలమనేరు మార్కెట్‌లో 14 కిలోల బాక్స్ ధర రూ.1000 పలికింది. - 6లో



రెఫర్ చేస్తే ఊరుకోను

జిల్లా ఆస్పత్రి నుంచి ఇతర ప్రాంతాలకు కేసులను రెఫర్ చేస్తే మాత్రం ఊరుకోమని డీసీహెచ్ఎస్ హెచ్చరించారు. - 6లో



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు



పెద్దశేష వాహనంపై స్వామి, అమ్మవార్లు

నయన మనోహరి..
శేషశయన విహారి

ఆదిశేషుడు..అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడికి వాహనం కాగా.. విష్ణుమూర్తి పెద్ద శేషుడిపై కొలువుదీరగా.. తిరుమాడ వీధులు పులకించగా తిరువేంకటనాథుడు మాడవీధుల్లో విహరించారు. దేవదేవుని దర్శించుకున్న భక్త జనం పులకించారు. అంతకు ముందు సాయంత్రం సకల దేవతలు అతిథులుగా తరలి రాగా.. జనకోటి ఆనందపరవశం కాగా ఊరేగింది గరుడ పటం.. మార్మోగింది గోవింద నామస్మరణం.. ఎగిరింది ధ్వజపటం.. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం శ్రీవారి శేషవాహన సేవ వైభవంగా సాగింది.

– తిరుమల



పెద్దశేష వాహన సేవలో కళాబృందం నాట్య ప్రదర్శన

న్యూస్‌రీల్

డిప్యూటీ సీఈఓగా జుబేదా



చైర్మన్, సీఈఓ చేతుల మీదుగా జాయినింగ్ ఆర్డర్స్ తీసుకుంటున్న డిప్యూటీ సీఈఓ జుబేదా

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓగా జుబేదా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు డీఎల్‌డీఓగా ఉన్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. మొదట జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవి కుమార్ నాయుడును కలిసి జాయినింగ్ ఆర్డర్లు తీసుకున్నారు. తర్వాత చాంబర్‌లో ఏఓలు, ఉద్యోగులను కలిసి పరిచయం చేసుకున్నారు. జెడ్పీ అభివృద్ధికి అందరి సహకారంతో కలిసి పని చేస్తానని తెలిపారు.

రెండోరోజు కొనసాగిన టెట్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రెండు, తమిళనాడు రాష్ట్రంలోని ఒక పరీక్ష కేంద్రంలో రెండవ రోజు టెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం మూడు పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 231 మందికి గాను 209 మంది హాజరుకాగా 22 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 278 మందికి గాను 236 మంది హాజరుకాగా 42 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ఉదయం 90.48 శాతం, మధ్యాహ్నం 84.89 శాతం హాజరుశాతం నమోదైనట్లు డీఈఓ తెలిపారు

సర్వే శాఖ ఏడీగా జయరాజ్



బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా సర్వే శాఖ ఏడీ జయరాజ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సర్వే, భూరికార్డుల శాఖ అడిషనల్ డైరెక్టర్‌గా జయరాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌లోని సర్వే శాఖలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఆయనను చిత్తూరుకు బదిలీ చేశారు. ఇక్కడ సర్వే శాఖ ఏడీగా గతంలో పనిచేస్తున్న గౌస్‌బాషాను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ జయరాజ్ విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు చర్యలు చేపడతానని తెలిపారు. అంతకుముందు ఆయనకు సర్వే శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

పట్టా భూముల్లో ఇసుక తవ్వకూడదు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇష్టానుసారం పట్టాభూముల్లో ఇసుక తవ్వేందుకు వీల్లేదని కలెక్టరేట్ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినా, వాటి ప్రకారం పట్టా భూముల్లో ఇసుక తవ్వాలంటే పట్టాదార్ పాస్‌బుక్, టైటిల్ డీడ్ పుస్తకం, గ్రామ మ్యాప్‌లో ఉన్న భూమి నకలుతో కలెక్టర్‌కు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో జిల్లాస్థాయి ఇసుక కమిటీ పట్టా భూమిని తనిఖీ చేస్తుందని చెబుతున్నారు. ఈ నిబంధనలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టరేట్ నుంచి ఆర్‌డీఓ, తహసీల్దార్లకు ఉత్తర్వులు పంపారు.

కలియుగ దైవం ప్రాశస్త్యం విశ్వవ్యాప్తం.. హిందువులకు ఆరాధ్యదైవం..ఆ దేవదేవుని ప్రసాదం పరమ పవిత్రం.. అంతటి తిరుమల లడ్డూపై కూటమి సర్కారు రాజకీయం.. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి అంటూ అసత్య ప్రచారం.. హిందువుల మనోభావాలతో చెలగాటం..దీనిపై కన్నెర్రజేసిన సుప్రీం.. వేంకటనాథుడితో రాజకీయాలొద్దని ఆగ్రహం.. నిజనిర్ధారణకు ప్రత్యేక సిట్ ఏర్పాటుకు నిర్ణయం.. వెరసి కూటమి కుట్రలకు సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో అడ్డుకట్ట. ఇదంతా కమలనాథుడి కటాక్షం అని సర్వత్రా హర్షం. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యి కల్తీ ఆరోపణలపై సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం శుభపరిణామం. దేశంలోని కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా కొంత కాలంగా జరుగుతున్న అసత్య ప్రచారానికి అడ్డుకట్ట పడిందని ఆధ్యాత్మిక వేత్తలు, సాధారణ ప్రజలు, రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు.

– తిరుపతి సిటీ



అసత్యాలు.. అక్షింతలు

కూటమి కుట్రకు సుప్రీం కోర్టు అడ్డుకట్ట

- సుప్రీం నిర్ణయం.. బాబు సర్కార్‌కు చెంప పెట్టే
- నెయ్యి కల్తీపై ప్రత్యేక సిట్ ఏర్పాటు శుభపరిణామం
- నిజాలు నిగ్గు తేలే సమయం ఆసన్నం
- రాజకీయ కుట్రలో భాగంగా చేసిన అసత్యప్రచారానికి బ్రేకులు
- స్వాగతిస్తున్న ఆధ్యాత్మిక వేత్తలు, ప్రజలు, రాజకీయ ప్రముఖులు

ఆహ్వానించదగిన పరిణామం



శ్రీవారి లడ్డూ ప్రసాదాల వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు ఆహ్వానించదగిన పరిణామం. భక్తుల మనోభావాలతో కూడుకున్న శ్రీవారి ప్రసాదాల విషయంలో రాజకీయ దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేయడం అందరూ మానుకుంటే మంచిది. రాష్ట్ర ముఖ్యమంత్రే విచారణ, ఆధారాలతో సంబంధం లేకుండా రాజకీయ ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో వారి పరిధిలోని విచారణతో నిజాలు బయటకు రావని స్వతంత్ర దర్యాప్తు సంస్థ కావాలని మొదటి నుంచి మేము కోరుకున్నాం. సుప్రీం పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తుతో వాస్తవాలు బయటకు వస్తాయి. తద్వారా కోట్లాది మంది భక్తుల మనోభావాలను పునరుద్ధరించినట్టు అవుతుంది.

– ఆర్కే రోజా, మాజీ మంత్రి

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం



తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాం. తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మత విద్వేషాలను రెచ్చగొడుతున్న పవన్‌కల్యాణ్ తక్షణం తమ పదవులకు రాజీనామాలు చేయాలి. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ తిరుపతి సభలో మత విద్వేషాలను రెచ్చగొట్టడం దారుణం. ప్రజల్లో మత, కుల విద్వేషాలను రగిల్చే పవన్ ఉప ముఖ్యమంత్రిగా ఉండడానికి ఏమాత్రం అర్హుడు కాదు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వేంకటేశ్వరస్వామి పట్ల అనుచితంగా ప్రవర్తించడం వల్లే శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ అపశ్రుతి చోటు చేసుకుంది.

– కె.నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

రాజకీయ కుట్ర..



తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ అంశం చంద్రబాబు కుట్ర. తెలుగువారి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను సైతం చంద్రబాబు తన రాజకీయ స్వార్థానికి వాడుకుంటున్నారు. కుట్రలు, కుతంత్రాలతో నీచరాజకీయాలకు పాల్పడుతున్నారు. ఆధారాలు లేకుండా కల్తీ జరిగిందంటూ చంద్రబాబు అండ్ కో ఎలా మాట్లాడతారు?. స్వార్థ రాజకీయాల కోసం పవిత్రమైన ఆలయాన్ని రోడ్డుకు ఈడ్చడం సరి కాదు. నెయ్యి కల్తీ అయిందంటూ విష ప్రచారం చేశారు. ఇది ముమ్మాటికీ రాజకీయ కుట్రే.

– లోకనాథ్‌రెడ్డి, కార్వేటీనగరం

ముక్కంటి చూస్తూ ఊరుకోడు...



సుప్రీంకోర్టులో జరిగిన వాదనల్లో కొన్ని విషయాలను గుర్తించాం. అసలు ఎప్పుడు నెయ్యిని సేకరించారు ? ఎప్పుడు పరీక్షించారు ? ఎప్పుడు వెనక్కి పంపారు ? అనే విషయంలో స్పష్ట లేదని తెలుసుకున్నాం. కుట్ర రాజకీయంలో లడ్డూను లాగి విషం చిమ్మారు. వాస్తవాలు నిర్ధారణ కాక ముందే తప్పుడు ప్రకటనలు ఇచ్చి పవిత్రమైన ఆలయ పరువుతీశారు. సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలతో ఇప్పుడు తప్పుడు ప్రచారం చేసిన వారి చెంప చెల్లుమంది. దేవున్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడం మానుకోవాలి.

– నాయనిరెడ్డి, జీడీనెల్లూరు

కల్తీపై వాస్తవాలు బయటపడతాయి



తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సీఎం చంద్రబాబుకు చెంపపెట్టు లాంటిది. వైఎస్సార్ సీపీపై బురద చల్లేందుకు చంద్రబాబు తిరుమల లడ్డూ కల్తీ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నారు. లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతువులకు సంబంధించిన కొవ్వు పదార్థాలు కలిశాయంటూ దుష్ప్రచారం చేస్తూ హిందువుల మనోభావాలను మంట కలుపుతున్నారు. సుప్రీం కోర్టు ప్రత్యేకమిటీని స్వాగతిస్తున్నాం.

– కుమార్ రాజా, జెడ్పీ మాజీ చైర్మన్, బంగారుపాళ్యం.

తాను తీసిన గోతిలో..



చంద్రబాబు నాయుడు చాలా తెలివైన వ్యక్తి. విజయవాడ వరదలు, సూపర్ సిక్స్, ఎన్నికల్లో ఈవీఎం ఓట్ల వ్యత్యాసంపై ప్రజల దృష్టిని మరల్చడానికే తిరుమల శ్రీవారి లడ్డూ వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చారు. లడ్డూలో కల్తీ లేదని టీటీడీ ఈఓ చెబుతున్నా.. బాబు దానికి భిన్నంగా హిందువుల మనోభావాలతో ఆడుకున్నారు. ఇప్పుడు సుప్రీం పర్యవేక్షణలో అధికార బృందం నిజానిజాలు తేల్చనుంది. ఇది స్వాగతించదగిన విషయం. ఇందులో ఎవరు తప్పు చేశారు ? ఎవరు ఎలాంటి డ్రామాలు ఆడారు..? అనే విషయాలు తేటతెల్లమవుతుంది. సుప్రీం ఏర్పాటు చేసిన కమిటీ కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. చంద్రబాబు నాయుడు తాను తీసిన గోతిలో తానే పడ్డాడు.

– సూర్యప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం, చిత్తూరు

దోషులను కఠినంగా శిక్షించాలి..



టీటీడీ ఈఓ శ్యామలరావు లడ్డూ ఎక్కడ కల్తీ జరగలేదని స్పష్టంగా వివరించారు. కల్తీ జరిగిన నెయ్యిని తిప్పి పంపించాయని, అయోధ్యకు పంపిన లక్ష లడ్డూలో కూడా ఎక్కడ కల్తీ లేదని స్వయంగా ఆయనే వెల్లడించారు. అలాంటప్పుడు ఈ విషయంపై రాద్ధాంతం చేయడం సరికాదు. సీబీఐ సిట్‌ను నియమించడం, విచారణలో నిజనిజాలను బయటిపెట్టి..తిరుమల పవిత్రతను కాపాడాలని కోరుకుంటున్నాం. దేవుడి విషయాల్లో రాజకీయం తగదు. ఈ విషయంపై విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించాం.

– పట్నం సురేంద్రరెడ్డి, విశ్వహిందూ పరిషత్, జిల్లా అధ్యక్షుడు, చిత్తూరు

దేవుడు మాత్రం క్షమించడు..



స్వార్థ రాజకీయాలు, ఎదుటి వ్యక్తులను రాజకీయంగా అణగదొక్కేందుకు ఆడే ఆటలో దేవున్ని లాగడం కరెక్ట్ కాదు. కొన్నాళ్లుగా లడ్డూలో కల్తీ నెయ్యి అంటూ తప్పుడు ప్రచారాలు హోరెత్తించాయి. తప్పుడు ప్రచారం చేసిన వారిని భక్తులు క్షమించినా.. దేవుడు మాత్రం వదిలిపెట్టడు. చేసిన తప్పుకు శిక్ష అనుభవించాల్సిందే. సుప్రీంకోర్టు అడిగిన ప్రశ్నలతో లడ్డూలో ఎలాంటి కల్తీ లేదని తెలుస్తోంది. ఆధారాలు లేకుండా ఎందుకు ఇలాంటి అబద్ధాలు ? – రాధిక, గుడిపాల

వాస్తవాలు బయటకు వస్తాయి..



తిరుమల పవిత్ర లడ్డూపైన చంద్రబాబు చేసిన కుట్రపూరితమైన వ్యాఖ్యలు త్వరలోనే బయటకు వస్తాయి. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. తిరుమల కల్తీ లడ్డూ ఆరోపణలపై సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయడం చంద్రబాబుకు చెంపపెట్టు. ఇప్పటికైనా చంద్రబాబు తన నీచ రాజకీయాల కోసం దేవున్ని వాడుకోవడం మానుకోవాలి.

– సురేంద్ర యాదవ్, జిల్లా బీసీ వైస్ ప్రెసిడెంట్,

ఆర్థిక లావాదేవీలే అశ్వియను చంపేశాయా ?

- చిన్నారి అశ్వియ హత్యకు మహిళల సహకారం ?
- ఊపిరితిత్తుల్లో నీరు, కడుపులో ఆహారం ఉన్నట్లు పోస్టుమార్టంలో గుర్తింపు
- ఎన్ఎస్ పేట ప్రాంత వాసుల పాత్రపైనా ఆరా
- ఓ మహిళను విచారిస్తున్న పోలీసులు

పుంగనూరు: ఆరు రోజుల కిందట కిడ్నాప్ అయి, ఆపై హత్యకు గురైన చిన్నారి అశ్వియఅంజుమ్ (7) కేసు సంచలనం రేకెత్తిస్తోంది. చిన్నారి హత్య వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తండ్రి అజ్మతుల్లా ఆర్థిక లావాదేవీలు, సన్నిహితులే చిన్నారి నిండునూరేళ్ల జీవితాన్ని చిదిమేశారని పలువురు వాపోతున్నారు. సంచలనం రేపిన చిన్నారి హత్యలో మహిళల పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. 11 పోలీస్ బృందాలు ఈ విషయాలను క్రోడీకరించి నిజాలు నిగ్గు తేల్చేపనిలో పడ్డారు.

స్థానికుల పాత్రపైనే అనుమానాలు..!



అశ్వియఅంజుమ్(ఫైల్)

పట్టణంలోని యూబీ కాంపౌండుకు చెందిన అజ్మతుల్లా ఇంటి నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు 4 కిలోమీటర్ల దూరం ఉంది. అందువల్ల బాధిత కుటుంబానికి సన్నిహితంగా ఉన్నవారే అశ్వియను తీసుకెళ్లగలరని పలువురు అంటున్నారు. ఎన్ఎస్ పేట వాసులకు మాత్రమే సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుకు వెళ్లే రహస్య మార్గాలు తెలిసే అవకాశం ఉందని, ఈ ప్రాంతవాసులే ఎవరైనా బాలిక హత్యకు సహకరించింటారని పోలీసులు గట్టిగా విశ్వసిస్తున్నారు.

ఊపిరితిత్తుల్లో నీరు..

చిన్నారి అశ్వియఅంజుమ్ పోస్టుమార్టం నివేదికలో పలు విషయాలను వైద్యులు గుర్తించినట్లు తెలిసింది. బాలిక ఊపిరితిత్తుల్లో నీరు చేరి ఉన్నట్లు గుర్తించారు. అలాగే కడుపులో పాప్‌కార్న్, ఆహారం ఉన్నట్లు తేలింది. దీన్ని బట్టి బాలికకు సన్నిహితులైన వారు బాలికకు ఆహారం పెట్టిన కొద్దిసేపటికే హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారిస్తున్నారు.



చిన్నారి అశ్వియ హత్యను నిరసిస్తూ పుంగనూరులో శుక్రవారం ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు (ఇన్‌సెట్) చిత్తూరులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

చిత్తూరు కార్పొరేషన్: చిన్నారి అశ్వియ మరణానికి కారుకులైన నిందితులను జిల్లా పోలీసు యంత్రాంగం గుర్తించి కఠినంగా శిక్షించాలని సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి నగరంలోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా నాయకులు నాగరాజన్, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పుంగనూరులో అభంశుభం తెలియని చిన్నారి సమ్మర్ ట్యాంకులో చిన్నారి శవం కనిపించడం బాధాకరమన్నారు. నిందితులను గుర్తించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టమాట అ'ధర'హో..

- పలమనేరులో 14 కిలోల బాక్సు ధర రూ.1000
- ఇతర రాష్ట్రాల్లో భారీగా తగ్గిన సరుకు
- వైరస్ తెగుళ్ల కారణంగా తగ్గిన దిగుబడి
- ఈ నెలంతా ధరలు ఉండొచ్చంటున్న వ్యాపారులు
- భారీగా విదేశాలకు ఎగుమతి


పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు: ఇన్నాళ్లూ హెచ్చుతగ్గుల నడుమ కొనసాగిన టమాటా ధరలు గత వారం రోజులుగా అధరహో అనిపిస్తున్నాయి. పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో టమాట సాగు ఎక్కువగా సాగవుతుంది. గత మూడు రోజుల నుంచి 14 కిలోల బాక్స్ ధర రూ.900 వరకు ఉండగా శుక్రవారం రూ.1000 పలికింది. బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు జిల్లాలోని మార్కెట్లకు వస్తుండడం, ఇదే సమయంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘర్, తెలంగాణలో సరుకు తగ్గడం, తమిళనాడులో సీజన్ ముగియడం, కర్ణాటకలో వైరస్ తెగుళ్ల కారణంగా ధరల పెరుగుదలకు కారణమైనట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఏదేమైనా టమాట పంట చేతికొస్తున్న రైతులకు ప్రాణం లేచివచ్చింది. ధరలు గిట్టుబాటుగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బయటి వ్యాపారుల చూపు ఇటువైపే..

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో పలమనేరు, పుంగనూరు, వీకోట, సోమల, సదుంలో టమాటా మార్కెట్లు ఉన్నాయి. ఈ సీజన్ ఆరంభానికి ఇక్కడి మార్కెట్లకు వంద లోడ్లు టమాటాలు రావాల్సి ఉండగా ఇప్పుడు 60లోడ్లు మాత్రమే వస్తున్నాయి. గత కొన్నాళ్లుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘర్‌లో వర్షాల కారణంగా టమాటా లేకపోవడం, కర్ణాటకలోని కోలారు, చింతామణి ప్రాంతాల్లో వైరస్ కారణంగా పంట దెబ్బతింది. ఇక తమిళనాడులోని రాయకోట, డిండిగల్, వడలంపేటలలో సీజన్ ఇప్పటికే ముగిసింది. ఇక అనంతపురం జిల్లాలోనూ సరుకు తగ్గింది. దీంతో బయటి రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడి మార్కెట్లకు వస్తున్నారు. కావాల్సినంత సరఫరా లేకపోవడం ఇదే సమయంలో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ధరలు పెరుగుదలకు కారణమైంది.

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో సాగు వివరాలు..

ఈ సీజన్‌లో టమాటా సాధరణ సాగు	:	5వేల హెక్టార్లు
ప్రస్తుతం సాగైన పంట	:	2వేల హెక్టార్లు
ఇప్పుడు కోతదశలో ఉన్న తోటలు	:	980 హెక్టార్లు
ఏటా ఈ సీజన్‌లో మండీలకు వచ్చే సరుకు	:	100 లారీ లోడ్లు
ప్రస్తుతం మార్కెట్లకు చేరుతున్న సరుకు	:	60 లోడ్లు

బయటి దేశాలకు ఎగుమతులు..

ప్రస్తుతం టమాటాకు ఏర్పడిన డిమాండ్ కారణంగా బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, యూఏఈ, సౌత్ ఆఫ్రికా దేశాలకు ఇక్కడి నుంచి టమాటా వెళ్తోంది. దీంతో క్వాలిటీ సరుకు భారీ ధర పలుకుతోంది. మొన్నటి దాకా బాక్సు రూ.500 పలికిన టమాటాలు ఇప్పుడు బాక్సు రూ.1000కి చేరింది. మరో నెలపాటు ఈ ధరలు ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

ఈనెలంతా ఆశాజనకంగానే ఉండొచ్చు..



బయటి రాష్ట్రాల్లో టమాటాలు లేకపోవడం, వర్షాల కారణంగా సరుకు నాణ్యత తగ్గడంతో టమాటాకు ధర వచ్చింది. కర్ణాటకలో వైరస్ కారణంగా దిగుబడి తగ్గింది. ఈ నెలంతా ధరలు బాగానే ఉండే అవకాశం ఉంటుంది. ఇప్పుడు పిందెదశలో ఉన్న తోటలకు సైతం ధరలు బాగానే ఉండొచ్చు.

\- డా. కోటేశ్వరరావు, ఉద్యానశాఖ సహాయసంచాలకులు

రైతుకు నష్టం రాదు..



టమాటాకు ఎప్పుడు ధరలు ఉంటాయో తెలీదు. అంతా అదృష్టంగా భావించాలి. కొన్నిసార్లు కనీసం పంట పెట్టుబడి రాక అప్పుల పాలయ్యాను. ఈ సీజన్‌లో ఉన్నట్టుండి ధరలు పెరిగాయి. ఇలా ధరలు ఉంటే రైతుకు నష్టం రాదు. మరో నెల పాటు ధరలు భారీగానే ఉంటాయని తెలుస్తోంది. కానీ లోకల్ సరుకు కూడా తక్కువగానే ఉంది.

\- మండీ సుధా, మండీ నిర్వాహకులు, పలమనేరు

ప్రజలను నిండా ముంచిన కూటమి ప్రభుత్వం

- తప్పుడు కేసులతో కూటమి సాధించేదేమీ లేదు
- వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు రెడ్డి

పలమనేరు: అమలుగాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రజలను నిండా ముంచిందని ఈ ప్రభుత్వానికి త్వరలో నూకలు చెల్లడం ఖాయమని బైరెడ్డిపల్లి మండల మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనపై కూటమి నేతలు తప్పుడు కేసులు పెట్టించి జైలుకు పంపారని ఇలాంటి వాటికి తాను బెదిరేది లేదని తెలిపారు. జిల్లా కోర్టులో శుక్రవారం తాను బెయిల్ పొందానని తెలిపారు. మూడు దశాబ్దాలుగా తాను లక్కనపల్లి సర్పంచ్‌గా, ఆపై జెడ్పీటీసీ, ఎంపీపీగా పనిచేసి జాతీయ అవార్డు పొందానని తెలిపారు. గతంలో ఇసుక అక్రమరవాణా కేసులో కోర్టుకు అపరాధం కట్టిన వ్యక్తి తనపై కక్షతో స్థానిక ఎమ్మెల్యే అండతో తప్పుడు కేసు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏసీబీ దాడులకు గురైన వారు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారు, రేషన్ బియ్యం దొంగలు నేడు అధికారం ఉందని రెచ్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరు చేస్తున్న ఆగడాలను జనం గమనిస్తున్నారని త్వరలో వీరికి ఇంతకు మించి ఉంటుందని హెచ్చరించారు.

మొగిలిఘాట్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్‌లోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ కోసం రవాణా, పోలీస్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం మొగిలి దొరచెరువు నుంచి జాతీయ రహదారిపై వాహనాల వేగనియంత్రణ చర్యలు చేపట్టారు. అందుకు తగ్గట్టుగా బ్యారికేడ్లు, రహదారిపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. మొగిలి ఘాట్‌లో గత నెలలో జరిగిన వరుస ప్రమాదాల్లో 14 మంది మృతి చెందగా 70 మందికి పైగా గాయపడ్డారు. మొగిలి ఘాట్‌లో చోటు చేసుకున్న ప్రమాదాలు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు రహదారుల భద్రతా కమిటీ ప్రమాదాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. ప్రమాదాలపై కలెక్టర్, ఎస్పీ సంబంధిత అధికారులతో చర్చించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. దీంతో సంబంధిత అధికారులు మొగిలి ఘాట్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు.

1.5 కేజీల గంజాయి స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నగరి : మండలంలోని నాగరాజు కుప్పం మార్గంలో రైస్‌మిల్ సమీపం గంజాయి రవాణాచేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. వివరాలు.. నగరి మండలంలోని ఓజీ కుప్పంకు చెందిన హరీష్ కొంతకాలంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా ఉంచారు. శుక్రవారం అతని వద్ద నుంచి తమిళనాడు అరక్కోణం జ్యోతినగర్‌కు చెందిన హుస్సేన్ (22), తనిగైపోరూరుకు చెందిన నరేంద్రన్ అలియాస్ మోదీ అజిత్‌రాణా (25) రైస్‌మిల్ సమీపంలో గంజాయి కొనుగోలు చేసుకుంటుండగా ముగ్గురినీ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1.5 కేజీల గంజాయి, రెండు మోటార్ సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లను డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.16 వేలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపారు. వీరిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులను డీఎస్పీ, ఎస్పీలు అభినందించారు.

అదుపు తప్పిన లారీ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్‌లో శుక్రవారం ఓ లారీ అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. తాడిపత్రి నుంచి బంగారుపాళెం టోల్‌ప్లాజా సమీపంలో గల ఫీడ్‌ఫ్యాక్టరీకి గోధుమల లోడుతో వస్తున్న లారీ మొగిలి ఘాట్ చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై బ్రేక్ డౌన్ కావడంతో అదుపు తప్పింది. డ్రైవర్ రాజేష్ లారీని చాకచక్యంగా రహదారి పక్కకు మళ్లించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేదంటే గతంలో లాగే ముందు వెళ్లే వాహనాలను ఢీకొని ప్రమాదం జరిగి ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

భారీగా అక్రమ మద్యం పట్టివేత

\- రూ.2.60 లక్షల మద్యం సీజ్, ముగ్గురి అరెస్ట్


పట్టుబడిన మద్యం చూపుతున్న పోలీసులు

గంగవరం: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురిని పట్టుకుని, వారి వద్ద నుంచి భారీగా మద్యాన్ని పట్టుకున్నట్లు గంగవరం పోలీసులు తెలిపారు. అర్బన్ సీఐ ప్రసాద్ తెలిసిన వివరాల మేరకు.. కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన కచ్చితమైన సమాచారం మేరకు పోలీసులు దండపల్లి క్రాస్‌లో వాహనాల తనిఖీ చేపట్టినట్టు తెలిపారు. అంతలో బెంగుళూరు వైపు నుంచి వస్తున్న బొలెరో లగేజీ వాహనాన్ని తనిఖీ చేయగా టమాటా క్రేట్ల కింద మద్యం బాక్సులు ఉన్నట్లు గుర్తించారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితులు బంగారుపాళ్యం మండలం నల్లంగాడు గ్రామానికి చెందిన మునీశ్వర్, హరిబాబు, రాజమాణిక్యంను అదుపులోకి తీసుకుని విచారించారు. కర్ణాటకలోని నంగిలి వద్ద దుకాణంలో మద్యం కొనుగోలు చేసి తమ గ్రామ పరిసరాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నిందితులు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. పట్టుబడిన మద్యం, వాహనాన్ని సీజ్ చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు


లబ్ధిదారులకు ఉచితంగా కృత్రిమ కాళ్లను అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : అంగవైకల్యం శరీరానికే కాని మనసుకు కాదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శుక్రవారం జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవనంలో ఉచితంగా కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జిల్లాలో 208 మంది లబ్ధిదారులకు రూ.15 లక్షలు విలువ చేసే 218 కృత్రిమ కాళ్లను ఫ్రీడం ట్రస్ట్, సేఫ్ టెక్నాలజీ సంస్థలు ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, ఫ్రీడమ్ ట్రస్ట్ బోర్డు మెంబర్ సుదర్శన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మోహన మంత్ర-2024


పోటీల్లో పాల్గొన్న ఎంబీయూ చాన్స్‌లర్ మోహన్ బాబు

చంద్రగిరి: మండలంలోని మోహన్ బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో శుక్రవారం మోహన మంత్ర–2024 మహోత్సవం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు పాల్గొని, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఎంబీయూలో మోహనమంత్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని, వారి మేధస్సును, నైపుణ్యాన్ని వెలికితతీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వచ్చిన ప్రతి విద్యార్థినీ అతిథిగా భావించి, వారికి తగిన సౌకర్యాలు కల్పించామన్నారు.

ప్రణాళిక ప్రకారం లక్ష్యం చేరుకోవాలి


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీవీఈఓ సయ్యద్ మౌలా

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు సమయం వృథా చేయకుండా ప్రణాళిక ప్రకారం లక్ష్యం చేరుకునేలా విద్యనభ్యసించాలని ఇంటర్మీడియెట్ డీవీఈఓ సయ్యద్ మౌలా అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆర్‌కే విద్యాలయ జూనియర్ కళాశాల 18వ ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యనందించేందుకు దివంగత ఎంపీ డీకే ఆదికేశవులు, దివంగత ఎమ్మెల్యే సత్యప్రభ కళాశాలలను నెలకొల్పారని చెప్పారు. అనంతరం గత విద్యాసంవత్సరం ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు శ్రీరాములురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండా యి. గురువారం అర్ధరాత్రి వరకు 63,376 మంది స్వామివారిని దర్శించుకోగా 25,146 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.56 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికె ట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

సమగ్రశిక్ష కార్యాలయానికి 4 అద్దె వాహనాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరల్ అధికారులకు 4 అద్దె వాహనాల కేటాయింపునకు రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు అనుమతిచ్చారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసరావు జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం జిల్లా కార్యాలయానికి చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు నాలుగు అద్దె వాహనాలను వినియోగించాల్సిన సెక్టోరల్ అధికారులు, బాధ్యతలను వివరించారు. ఉత్తర్వుల ప్రకారం బాధ్యతలు నిర్వర్తించాలన్నారు.

బస్సు పాస్ సేవలకు బ్రేక్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆర్టీసీ బస్‌పాస్ వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్ ఆధునీకరణతో రెండు రోజులపాటు పాసుల జారీ, రెన్యూవల్ ప్రక్రియ ఉండదని డీపీటీఓ జగదీశ్వర్ తెలిపారు. శని, ఆదివారాల్లో ఈ సాఫ్ట్‌వేర్ ఆధునీకరణ జరుగుతుందని, సోమవారం నుంచి బస్‌పాస్ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నాటు తుపాకుల పట్టివేత

కాణిపాకం: అడవుల్లో జంతువుల వేటకు ఉపయోగించే రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని శుక్రవారం యాదమరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు..యాదమరి మండలం కీనాటంపల్లి పంచాయతీ షికారికాలనీకి చెందిన సొన్నం అలియాస్ చెన్నై (22), చిత్తూరు రూరల్ మండలం అనుపల్లికి చెందిన రమేష్(33) మధ్యాహ్నం కోనాపల్లి కమ్మురాయనిమిట్ట క్రాస్‌లోని ఓ చెట్టు కింద నాటు తుపాకులతో కనిపించారు. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు వారి వద్ద ఉన్న తుపాకులను, పేలుడుకు వినియోగించే 50 గ్రాముల బ్లాక్ పౌడర్, చిన్న చిన్న ఇనుప గుండ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు.

రెఫర్ చేస్తే ఊరుకోను

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా ఆస్పత్రిలో రెఫర్ల సంఖ్య పెరిగితే ఊరుకోనని డీసీహెచ్‌ఎస్ ప్రభావతి స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తొలుత మెయిన్ గేటు వద్ద మరమ్మతులను తాత్కాలికంగా పూర్తి చేయించారు. తర్వాత అత్యవసర విభాగాన్ని పరిశీలించి రెఫర్ కేసుల సంఖ్యను తగ్గించాలన్నారు. మెరుగైన వైద్యం అందించి ఆస్పత్రికి మంచి పేరు వచ్చేలా చికిత్స అందించాలని, అత్యవసర సేవల విషయంలో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. రోగులతో అమర్యాదగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతివార్డుకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, మరుగుదొడ్లు శుభ్రత పాటించడంతో పాటు మరమ్మతులు చేయించాలని ఆస్పత్రి అధికారులకు సూచించారు. అనంతరం ఆస్పత్రి అధికారులతో సమావేశమయ్యారు. అత్యవసర విభాగ గది చాలడం లేదని సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ ఆమె దృష్టికి తీసుకురాగా, ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చేద్దామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అపోలో నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

టీబీ, కుష్టు వ్యాధుల నివారణే లక్ష్యం


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): టీబీ, కుష్టు వ్యాధి నివారణే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమిష్టిగా పని చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం టీబీ, కుష్టు వ్యాధినివారణపై జిల్లా అధికారులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీబీతో పాటు కుష్టు వ్యాధిని 2030 నాటికి పూర్తిగా నివారించేలా పని చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో చేపట్టే కార్యక్రమాలను ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, మండల వైద్యాధికారులు ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్, సమావేశంలో పాల్గొన్న అధికారులు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర 2047 విజన్ అంశంపై స్వచ్ఛంద సంస్థలు, జిల్లా అధికారులు, పారిశ్రామిక వేత్తలు, వన సంరక్షణ సమితి నాయకులతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటరీకి అన్ని వర్గాల నుంచి సలహాలు, సూచనలు సేకరిస్తున్నట్లు తెలిపారు. రానున్న 5 ఏళ్లకు, 2047 నాటికి జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికల డాక్యుమెంటరీ సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. ఇందులో జిల్లాలో వైద్య సదుపాయాల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యాన, పశు సంపద, పరిశ్రమల అభివృద్ధికి సంబంధించి సూచనలు ప్రభుత్వానికి డాక్యుమెంటరీ రూపంలో సమర్పించాలని చెప్పారు. ఇప్పటి వరకు రైతులు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లు, ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కొంతవరకు సూచనలు సేకరించినట్లు తెలిపారు. జిల్లాస్థాయి విజన్ ప్లాన్ తయారీకి అక్టోబర్ 15న ఆఖరు తేదీ అని, ఆలోపు సలహాలు, సూచనలు సమర్పించాలన్నారు.

ఉపాధి కల్పించండి..

జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు ఎక్కువగా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పుంగనూరు, కుప్పం ప్రాంతాల్లో హార్టికల్చర్ పైన ఆధారపడి జీవిస్తున్న రైతుల సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు విరివిగా ప్రారంభించాలన్నారు. పశు సంపద అధికంగా ఉన్నందున డెయిరీ అభివృద్ధి చేయాలన్నారు. విద్యాభివృద్ధి కోసం చిత్తూరులో యూనివర్సిటీ స్థాపన చేయాలన్నారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందించేందుకు ముందడుగు వేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, సీపీఓ సాంబశివారెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీదేవిగా బోయకొండ గంగమ్మ


బోయకొండలో అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట హోమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు


బాలాత్రిపుర సుందరిగా గంగమ్మ

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరొందిన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అర్చకుల బృందం, వేదపండుతులు కలిసి అమ్మవారిని పరిమళ భరితపు పుష్పాలు, బంగారు ఆభరణాలతో ఆదిపరాశక్తిగా పేరొందిన బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఆలయం ముఖద్వారంతో పాటు గర్భాలయం, ప్రధాన ఆలయంలో విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అమ్మవారి ఆవరణలో అమ్మవారి ఉత్సవమూర్తిని నెలకొల్పి, ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు గోవర్ధన శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు సుభద్రమ్మ వెంకటరెడ్డి(బోయకొండ)జానకి, మల్లయ్య (మదనపల్లె)సుజాత, జగదీశ్వర్‌రెడ్డి(శ్రీకాళహస్తి) కళావతి, వెంకటరమణ(గడ్డూరు)లక్ష్మీదేవి, వెంకటరమణ(తిరుపతి), పూర్ణిమ, ప్రదీప్ గోపాల్(బెంగళూరు) దంపతులు రూ.5116 చెల్లించి ఉభయదారులుగా వ్యవహరించారు.

నేడు శాకాంబరీదేవిగా గంగమ్మ..

దసరా ఉత్సవాల్లోభాగంగా రెండవరోజైన శనివారం అమ్మవారు శాకాంబరిదేవిగా దర్శనమిస్తారని ఈఓ ఏకాంబరం తెలిపారు. ఉభయదారులుగా పాల్గొనే భక్తులు రూ.5116 చెల్లించి రసీదు పొందాలని కోరారు.